సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శనివారం । 24 । ఆగస్టు । 2024



యూరియా.. నయా దందా

పీఏసీఎస్ అధికారులు యూరియాను నేరుగా కాకుండా వ్యాపారుల ద్వారా రైతులకు విక్రయిస్తున్నారు. 8లో



ధర లేదు.. గిట్టుబాటు కాదు

గిట్టుబాటు ధర లేకపోవడంతో పెట్టుబడి కూడా రాదనే మనోవేదనతో ఓ రైతు తన బెండతోటను ధ్వంసం చేశాడు. 8లో

గరిష్టం / కనిష్టం 30° / 25°

వాతావరణం

జిల్లాలో శనివారం వాతావరణం చల్లగా ఉంటుంది. సాయంత్రం పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లికి వైభవంగా పంచామృతాభిషేకం నిర్వహించారు. మండల పరిధిలోని శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయంలో శుక్రవారం అర్చకులు అమ్మవారి జన్మస్థలం వద్ద పంచామృతం, పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం ఆలయంలోని మూలవిరాట్‌కు అభిషేకం, పంచహారతులు, నివేదన, నీరాజనం, మంత్రపుష్పం పూజలతోపాటు కుంకుమ పూజ, గణపతిహోమం నిర్వహించారు.

‘మిషన్ భగీరథ’కు మరమ్మతులు



మిషన్ భగీరథ పైపులైన్‌కు మరమ్మతులు నిర్వహిస్తున్న సిబ్బంది

పాల్వంచరూరల్: మండల పరిధిలోని పెద్దమ్మగుడి వెనుక ఉన్న మిషన్ భగీరథ ప్రధాన పైపులైన్‌కు శుక్రవారం మరమ్మతులు చేపట్టారు. కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీలు, పాల్వంచ, లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి, సుజాతనగర్ తదితర మండలాలకు తాగునీరు సరఫరా చేసే పైపులైన్ బుధవారం రాత్రి సమయంలో పగిలిపోయిన విషయం విదితమే. పైపులైన్ పగిలిన ప్రదేశంలో మిషన్ భగీరథ గ్రిడ్ అధికారులు క్రేన్ల సహాయంతో మరమ్మతులు ప్రారంభించారు. పగిలిన పైపును తొలగించి రూ.3 లక్షలతో కొత్త పైపు ఏర్పాటు చేస్తున్నట్లు డీఈ సాయి తెలిపారు. పనులు పూర్తి చేసి శనివారం నుంచి తాగునీటి సరఫరా పునరుద్ధరిస్తామని పేర్కొన్నారు.

బాల పురస్కార్‌కు దరఖాస్తు చేసుకోండి

కొత్తగూడెంటౌన్: ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డు–2025 కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమశాఖ అధికారిణి వేల్పుల విజేత శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. విద్యా, ఆరోగ్యం, పోషణ, బాలల సంరక్షణ, సామాజిక రంగాలోల సేవలందించిన బాలబాలికలు, 1.4.2024 నాటికి 5 ఏళ్ల నుంచి 18 ఏళ్ల వయసు ఉన్నవారు అర్హులని వివరించారు. ఆసక్తి కలిగిన వారు https//awards.gov.in వెబ్‌సైట్‌లో నామినేషన్లు ఆన్‌లైన్ చేయాలని పేర్కొన్నారు. జిల్లాలోని పాఠశాలల నుంచి అర్హత కలిగిన బాలబాలికలను ఉపాధ్యాయులు ఎంపిక చేసి దరఖాస్తు చేయాలని తెలిపారు. ఈ నెల 31 వరకు దరఖాస్తు గడువు ఉందని పేర్కొన్నారు.

తాగునీటి స్వచ్ఛతపై కేంద్ర అధికారుల ఆరా



అశ్వాపురంలో తాగునీటిని పరిశీలిస్తున్న అధికారులు

అశ్వాపురం: మండలంలో శుక్రవారం కేంద్ర జల జీవన్ మిషన్ అధికారులు పర్యటించారు. అశ్వాపురం, తుమ్మలచెరువు, గొందిగూడెం గ్రామాలను సందర్శించి తాగునీటి సరఫరాపై ఆరా తీశారు. తాగునీటి స్వచ్ఛత, సమస్యలపై గ్రామస్తులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. తాగునీటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుధాకర్, సందీప్, సంపత్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కిషోర్ పాల్గొన్నారు.

పీజీ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సూపర్‌బజార్(కొత్తగూడెం): సింగరేణి డిగ్రీ అండ్ పీజీ మహిళా కళాశాలలో ఎంకామ్, ఎమ్మెస్సీ బోటనీ, కంప్యూటర్ సైన్స్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శారద శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీపీజీఈటీ–2024 ఆన్‌లైన్‌లో వెబ్‌ఆప్షన్ ద్వారా కళాశాలను ఎంచుకునేందుకు ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు అవకాశం ఉందని పేర్కొన్నారు. మేనేజ్‌మెంట్ ద్వారా కూడా సీట్లు పొందవచ్చని, వివరాలకు 08744–242492 నంబరులో సంప్రదించాలని కోరారు.

మావోల హింసాకాండ



మావోయిస్టులు, పోలీసుల మధ్యలో జరుగుతున్న యుద్ధంలో మళ్లీ కోవర్టు ఆపరేషన్లు తెరమీదకు వచ్చాయి. కోవర్టులుగా మారిన వారు విప్లవ ద్రోహులంటూ మావోయిస్టులు వరుసగా మరణ శిక్షలు అమలు చేస్తుండగా, దండకారణ్యంతో పాటు తెలంగాణలోనూ భయాందోళన నెలకొంది.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

కోవర్టులంటూ నలుగురిని హతమార్చిన మావోయిస్టులు

- విప్లవ ద్రోహులని ఇద్దరికి హెచ్చరికలు జారీ
- ఈ ఏడాది భారీగా నష్టపోయిన విప్లవ దళాలు

ఉక్కిరి బిక్కిరి

ఆపరేషన్ కగార్‌లో భాగంగా మావోయిస్టులకు పట్టున్న బస్తర్ అడవులను పోలీసులు, భద్రతా దళాలు జల్లెడ పడుతున్నాయి. ముప్పేట దాడి చేస్తూ మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలను చుట్టుముడుతున్నాయి. ఈ క్రమంలో అక్కడ తరచుగా ఎదురుకాల్పులు చోటు చేసుకుంటున్నాయి. ఈ ఏడాదిలో ఇప్పటివరకు జరిగిన పలు ఎన్‌కౌంటర్లలో 180 మందికి పైగా మావోయిస్టులు చనిపోయారు. అయితే జూలై నుంచి వర్షాలు పెరగడంతో అడవి చిక్కబడింది. వాగులు వంకలు పొంగి పొర్లుతున్నాయి. దీంతో పోలీసులు, భద్రతా దళాలు అడవుల్లోకి చొచ్చుకుని వెళ్లడం ఇబ్బందిగా మారింది. తమకు అనుకూలమైన పరిస్థితులు ఏర్పడటంతో ఇటీవల జరిగిన నష్టాలపై పార్టీ పరంగా సమీక్ష మొదలైంది. ఈ క్రమంలో కొందరిని అనుమానిస్తూ విప్లవ ద్రోహులుగా పేర్కొనగా మరి కొందరిని కోవర్టులంటూ మరణ శిక్షలు విధించడం మొదలైంది.

విప్లవ ద్రోహులంటూ..

గడిచిన రెండు వారాలుగా తమతోపాటు పని చేస్తున్న కొందరు మావోయిస్టులు కోవర్టులుగా మారి పోలీసులకు సమాచారం చేరవేస్తున్నారంటూ ఆ పార్టీ ఆరోపిస్తోంది. ఈ మేరకు ఒక్కో కమిటీ నుంచి సమాచారం బయటకు వస్తోంది. ముందుగా ఈ నెల 9న అల్లూరి సీతారామరాజు, భద్రాద్రి కొత్తగూడెం డివిజన్ కమిటీ కార్యదర్శి ఆజాద్ పేరుతో లేఖ వచ్చింది. అందులో అనంతరపురం, గుంటూరు జిల్లాలకు చెందిన ఇద్దరు వ్యక్తులు గతంలో మావోయిస్టు పార్టీలో పని చేసేవారని, అయితే వారు పోలీసులకు పట్టుబడ్డారని, ఆ తర్వాత కోవర్టులుగా మారి పార్టీకి నష్టం చేసేందుకు ప్రయత్నించారని ఆ లేఖలో పేర్కొన్నారు. వారిని విప్లవ ద్రోహులుగా పరిగణిస్తున్నామని ప్రకటించారు. అయితే వారికి ప్రాణహాని తలపెట్టలేదు. దీంతో వారిద్దరు ఆ తర్వాత అడవిని వదిలి పోలీసులకు లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలిశారు.

మరణభయం

ఆరంభంలో తమలో ఉన్న కోవర్టులను గుర్తించి హెచ్చరికలు జారీ చేసిన మావోయిస్టులు ఆ తర్వాత తీవ్రత పెంచారు. తమకు నష్టం కలిగించాలనే ఆలోచన రాకుండా భయాందోళనలు కలిగించే లక్ష్యంతో తమ సిద్ధాంతాల పట్ల నమ్మకం ఉన్న వ్యక్తులపైనే ఆటవికంగా మరణ శిక్షలు అమలు చేస్తున్నారు. ఈనెల 14న దక్షిణ బస్తర్ డివిజన్ కమిటీ, గంగా పేరుతో మరో లేఖ విడుదలైంది. అందులో పద్నాలుగేళ్లుగా పార్టీలో పని చేస్తున్న ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాకు చెందిన కుర్సం మనీశ్ ఆలియాస్ రాజు కోవర్టుగా మారాడని, అందుకే అతనికి మరణ శిక్ష విధించినట్టుగా ప్రకటించారు.

- ఈ నెల 15న డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్ప్స్ (డీఆర్‌జీ)లో పని చేసే సీతారాం అనే జవాన్, ఇంటిలిజెన్స్‌లో పని చేస్తున్న శంకర్‌నే వ్యక్తులు వారి ఇళ్ల దగ్గర ఉండగా మావోయిస్టులు చంపారు. దక్షిణ బస్తర్ డివిజన్, పామేడు ఏరియా కమిటీ ఈ పనిచేసినట్టు ప్రకటించింది.
- ఈ నెల 21న తెలంగాణకు చెందిన పారా మెడికల్ విద్యార్థిగా విప్లవ బాట పట్టిన రాధ అలియాస్ నీల్సోను ఇదే ఆరోపణలపై హతమార్చారు. ఏవోబీ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి గణేశ్ ఈ హత్యకు బాధ్యత తీసుకున్నారు. ఇలా ఒక్కో కమిటీ తరఫున ఒక్కో హత్య జరుగుతూ వస్తుండటంతో సంచలనంగా మారింది. మావోయిస్టుల పేరుతో ఇటు ఛత్తీస్‌గఢ్, ఒడిశాలతోపాటు తెలంగాణలోనూ అనేక కమిటీలు ఉన్నాయి. కేవలం పది రోజుల వ్యవధిలో మావోయిస్టులు నలుగురి ప్రాణాలు తీశారు. దీంతో అడవిబాట పట్టి అన్నల్లో కలిసిన తమ బిడ్డలు ఎలా ఉన్నారనే భయాందోళన వారి కుటుంబ సభ్యుల్లో కలుగుతోంది.

రుణమాఫీకి 5,893 దరఖాస్తులు

నగదు జమకాని రైతుల నుంచి స్వీకరణ



కలెక్టర్ జితేష్ వి.పాటిల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రైతు రుణమాఫీ అమలులో భాగంగా సమస్యల పరిష్కారానికి నిర్వహించిన ప్రజావాణిలో ఇప్పటివరకు 5,893 దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ శుక్రవారం తెలిపారు. వివిధ కారణాల వల్ల రుణమాఫీ జమకాని రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించామని, వీటిలో 4,230 దరఖాస్తులను అప్‌డేట్ చేశామని పేర్కొన్నారు. అన్నపురెడ్డిపల్లి మండలంలో 361, అశ్వారావుపేటలో 332, చండ్రుగొండలో 447, దమ్మపేటలో 222, ములకలపల్లిలో 342, భద్రాచలంలో 36, చర్లలో 282, దుమ్ముగూడెంలో 276, చుంచుపల్లిలో 75, జూలూరుపాడులో 426, కొత్తగూడెంలో 38, లక్ష్మీదేవిపల్లిలో 327, పాల్వంచలో 148, సుజాతనగర్‌లో 222, ఆళ్లపల్లిలో 128, అశ్వాపురంలో 273, బూర్గంపాడులో 246, గుండాలలో 90, కరకగూడెంలో 207, మణుగూరులో 177, పినపాకలో 288, టేకులపల్లిలో 595, ఇల్లెందు మండలంలో 355 దరఖాస్తులు వచ్చాయని వివరించారు.

నాణ్యమైన విద్యనందించాలి

డీఈఓ వెంకటేశ్వరాచారి



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ వెంకటేశ్వరాచారి

కొత్తగూడెంఅర్బన్/చండ్రుగొండ: ప్రారంభ శిక్షణను సద్వినియోగం చేసుకుని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వరాచారి సూచించారు. శుక్రవారం పాత కొత్తగూడెంలోని తెలంగాణ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ఉన్న జిల్లా విద్యావనరుల శిక్షణ కేంద్రంలో పదోన్నతి పొందిన తెలుగు, హిందీ, గణితం, జీవశాస్త్ర ఉపాధ్యాయులకు నిర్వహించిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. నూతనంగా పదోన్నతి పొందిన తెలుగు, హిందీ, గణితం, జీవశాస్త్రం సబ్జెక్టుల ఉపాధ్యాయులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రాథమిక పాఠశాలల్లో బోధనకు, ఉన్నత పాఠశాలల్లో బోధనకు ఉండే తేడాలపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. అనంతరం చండ్రుగొండలోని జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన జాతీయ అంతరిక్ష దినోత్సవంలో పాల్గొన్నారు. విద్యార్థుల్లో పోటీతత్వం ఉండాలని చెప్పారు. వ్యాసరచన, డ్రాయింగ్ పోటీల విజేతలకు బహుమతులు అందించి, అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఏ. నాగరాజశేఖర్, సమగ్ర శిక్ష జిల్లా ఫైనాన్స్ అధికారి ఎస్.శ్రీనివాస్, జిల్లా సైన్స్ అధికారి ఎస్.చలపతిరాజు, ఎంఈఓ సత్తెనపల్లి సత్యనారాయణ, హెచ్‌ఎం వాజిద్, డీఆర్పీలు, పదోన్నతి పొందిన 190 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలతో సృజనాత్మకత



ఎగ్జిబిట్లను తిలకిస్తున్న జీఎం జగ్గారావు

అశ్వాపురం: వైజ్ఞానిక ప్రదర్శనల వల్ల విద్యార్థుల్లో సృజనాత్మకథ, ఆలోచన, తార్కిక శక్తి పెంపొందుతుందని మణుగూరు భారజల కర్మాగారం జీఎం జగ్గారావు అన్నారు. మండల కేంద్రంలోని గౌతమీనగర్ కాలనీలో ఉన్న అణుశక్తి కేంద్రీయ విద్యాలయంలో శుక్రవారం వైజ్ఞానిక ప్రదర్శన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జీఎం ప్రారంభించి మాట్లాడుతూ విద్యార్థులకు నూతన శాస్త్రీయ పరికరాలు, సూత్రాలపై అవగాహన పెరుగుతుందన్నారు. వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులు విజ్ఞాన, సాంఘిక, గణిత శాస్త్ర ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. సుమారు 200 నమూనాలు ప్రదర్శించగా, విద్యార్థులను జీఎం అభినందించారు. ఈ కార్యక్రమంలో డీజీఎం శర్మ, విద్యాలయం వైస్ ప్రిన్సిపాల్, ప్రధానోపాధ్యాయుడు, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సెమినార్‌లో ఎమ్మెల్యే ఆదినారాయణ



కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రెండు రోజులుగా ఢిల్లీలో జరుగుతున్న జాతీయ స్థాయి సెమినార్‌లో శుక్రవారం అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ప్రసంగించారు. ఉపాధి హామీ పథకంపై నిర్వహించిన ఈ సెమినార్‌లో కూలీల పని దినాలు, నిధులు, సౌకర్యాలతోపాటు ఇతర అంశాలపై సూచనలు ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. – అశ్వారావుపేటరూరల్

రామయ్యకు సువర్ణ తులసీ అర్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



ఉత్సవాలకు అంకురార్పణ చేస్తున్న త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో శుక్రవారం సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించారు. అనంతరం స్వామివా రికి కంకణధారణ, యజ్ఞోపవీతధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ వేడుకను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

శ్రీమద్భాగవత సప్తాహ ఉత్సవాలు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలోని చిత్రకూట మండప ప్రాంగణంలో శ్రీమద్భాగవత సప్తాహ ఉత్సవాలకు శ్రీశ్రీశ్రీ త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామివారు శుక్రవారం అంకురార్పరణ చేశారు. ఈ నెల 30 వరకు ఉత్సవాలు జరుగుతాయని ఈఓ రమాదేవి తెలిపారు.

నాసిరకం సరుకులు సరఫరా చేస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న పీఓ రాహుల్

భద్రాచలంటౌన్: ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలు, గురుకుల పాఠశాలు కళాశాలలు, వసతి గృహాలకు నాణ్యమైన వంట సరుకులు సరఫరా చేయాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ అన్నారు. ఐటీడీఏ సమావేశం మందిరంలో శుక్రవారం నిర్వహించిన టెండర్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాసిరకంగా ఉన్న సరుకులు సరఫరా చేస్తే సంబంధిత ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీడీ మణెమ్మ, ఆర్సీఓ నాగార్జునరావు, జీసీసీ డీఎం దావీద్, అధికారులు అశోక్ కుమార్, సత్యవతి, లక్ష్మీజీ, నర్సింగ్ రావు, పాపారావు, జయరాజ్, అరుణకుమారి, కరీం, మాధవి, వసంత, లక్ష్మీ, నరేందర్, హనుమంతరావు, వాల్ సింహా తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణంపై అవగాహన పెరగాలి

సింగరేణి సీఎండీ బలరాం



మొక్కలు నాటుతున్న సీఎండీ బలరాం, ఇతర అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): పర్యావరణంపై అందరికీ అవగాహన పెరగాలని సింగరేణి సీఎండీ ఎన్.బలరాం సూచించారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కొత్తగూడెంలోని సింగరేణి గెస్ట్‌హౌస్‌లో 235 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి అడుగు పచ్చదనం అనే నినాదంతో సమీప గ్రామాల్లో, మైన్లు, డిపార్ట్‌మెంట్లు, డంప్ యార్డ్‌ల్లో మొక్కలు నాటాలన్నారు. సంస్థ పరిధిలో 2023 నాటికి 14,680.5 హెక్టార్లలో 7.32 కోట్ల మొక్కలు నాటామని, ఈ ఏడాది 13.30 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యం నిర్దేశించుకున్నట్లు తెలిపారు. తాను ఇప్పటివరకు 18,291 మొక్కలు నాటానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు జి. వెంకటరమణ, వివేక్‌బాబు, హరినారాయణ, రాజీవ్‌కుమార్, ఆర్‌బి డేవిడ్ అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే మొదటి నోటిఫికేషన్ ఫలితాలు

సింగరేణి సంస్థలో 271 ఖాళీల భర్తీకి మొదట నోటిఫికేషన్ ఇచ్చి, గత జూలై 20, 21 తేదీల్లో నిర్వహించిన కంప్యూటర్ ఆధారిత పరీక్షల (సీబీటీ) ఫలితాలు త్వరలో విడుదల చేస్తామని సీఎండీ ఎన్.బలరామ్ తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పరీక్షలు పారదర్శకంగా నిర్వహించామని పేర్కొన్నారు. మొత్తం 10 విభాగాల్లో 12,045 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారని పేర్కొన్నారు. కీ విడుదల చేసి, అభ్యంతరాలు కూడా స్వీకరించామని అన్నారు.

ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్‌కు సన్మానం



ట్రైకార్ చైర్మన్‌ను సన్మానిస్తున్న నాయకులు

మణుగూరు టౌన్: రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ డాక్టర్ బెల్లయ్య నాయక్‌కు శుక్రవారం మణుగూరులో కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. మణుగూరు ప్రజాభవన్‌లో టీపీసీసీ సభ్యులు చందా సంతోష్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పీరినాకి నవీన్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కూరపాటి సౌజన్య, మండల నాయకులు జర్పుల జగన్, రహీం పాషా, గౌస్ పాషా తదితరులు ఉన్నారు.

నేడు ఐటీడీఏలో సమీక్షకు హాజరు..

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో శనివారం నిర్వహించే సమీక్ష సమావేశానికి ట్రైకార్ చైర్మన్ తేజావత్ బెల్లయ్య నాయక్ హాజరవుతారని పీఓ బి.రాహుల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలుత శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని దర్శించుకుంటారని పేర్కొన్నారు. సమావేశం తర్వాత శానిటరీ నాప్కిన్ తయారీ యూనిట్, ఎంఎస్‌ఎంఈ యూనిట్ కేంద్రాలను సందర్శిస్తారని తెలిపారు. కాగా శుక్రవారం రాత్రి చైర్మన్ భద్రాచలం చేరుకోగా అధికారులు డేవిడ్‌రాజ్, శంకర్ రావు, భాస్కర్ తదితరులు స్వాగతం పలికారు.

యథేచ్ఛగా బియ్యం దందా

- అక్రమంగా మిల్లులకు తరలుతున్న రేషన్ బియ్యం
- పాలిష్ చేసి మళ్లీ మార్కెట్‌లో విక్రయిస్తున్న వ్యాపారులు
- రాష్ట్రాలు దాటిస్తున్న కొందరు దళారులు
- పట్టించుకోని పౌరసరఫరాల శాఖ అధికారులు



కొత్తగూడెంలోని ఓ రేషన్ దుకాణం

కొత్తగూడెంఅర్బన్: పేదల బియ్యంతో మిల్లర్లు, దళారులు, రేషన్ డీలర్లు యథేచ్ఛగా దందా సాగిస్తున్నారు. జిల్లాలో ప్రతి నెలా రూ.కోట్లలో రేషన్ బియ్యం దందా జరుగుతున్నా సివిల్ సప్లై అధికారులు పట్టించుకోవడంలేదు. జనవరి నుంచి ఇప్పటివరకు జిల్లాలో కేవలం 40 కేసులు మాత్రమే నమోదు చేశారంటే అధికారుల నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. దందాలో రేషన్ డీలర్లే ప్రధాన పాత్ర అని తెలిసినా వారిపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. కొందరు డీలర్లు నేరుగా లబ్ధిదారులకు బియ్యానికి బదులు నగదు అందజేస్తున్నారు. రేషన్ బియ్యం ఏళ్ల తరబడి పక్కదారి పడుతున్నా ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులకు పట్టడంలేదు. రేషన్‌కార్డు లబ్ధిదారులకు 20వ తేదీ వరకు బియ్యం పంపిణీ చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత మిగిలిన బియ్యాన్ని గోదాంకు రిటర్న్ చేయాల్సి ఉంటుంది. కానీ డీలర్లు మొత్తం పంపిణీ చేసినట్లు లెక్కలు చూపించి, అక్రమంగా విక్రయించుకుని జేబులు నింపుకుటున్నారు. క్వింటాళ్ల కొద్దీ అర్ధరాత్రి, తెల్లవారుజామున మిల్లులకు పంపుతున్నారు. అక్కడ రీసైక్లింగ్ చేసి ఇతర రాష్ట్రాలు దాటిస్తున్నారు.

జిల్లా కేంద్రంలోనే అధికం...

జిల్లాలో మొత్తం 443 రేషన్ దుకాణాలున్నాయి. కొన్నిచోట్ల డీలర్లు లేరు. దీంతో మూడు నుంచి నాలుగు దుకాణాలను ఒక్కరికే అప్పగించారు. కొత్త డీలర్లను మాత్రం నియమించడంలేదు. దీంతో సదరు డీలర్ బినామీలతో దుకాణాలను నడుపుతున్నారు. బియ్యం మిగుల్చుకుని కొందరు దళారులతో ఒప్పందం చేసుకుని మిల్లులకు, ఇతర ప్రాంతాలకు పంపుతున్నారు. జిల్లా కేంద్రంలోని రామాటాకీస్ ఏరియా, గొల్లగూడెం త్రీటౌన్ పోలీసు స్టేషన్‌కు సమీపంలో ఉన్న మిల్లు, పాల్వంచలోని పలు మిల్లులకు ఎక్కువగా రేషన్ బియ్యం వెళ్తున్నాయనే ఆరోపణలున్నాయి. ఆయా మిల్లుల్లో తనిఖీలు చేపడితే రేషన్ బియ్యం క్వింటాళ్లలో దొరికే అవకాశాలున్నాయి. కానీ అధికారులు ఆ మిల్లుల వైపు కన్నెత్తి కూడా చూడటంలేదు. కొందరు దళారులు కారుకొండరామవరం, ఎదురుగడ్డ, బూడిదగడ్డ, కూలీలైన్ ఏరియా, రామవరం ఏరియాలలో అడ్డాలను ఏర్పాటు చేసుకొని రేషన్ బియ్యం నిల్వ చేస్తున్నారు. అనంతరం నంబర్ ప్లేట్ లేని డీసీఎం వ్యాన్లలో తరలిస్తున్నారు. రేషన్ బియ్యం విక్రయిస్తే పీడీ కేసులు నమోదు చేస్తామని అధికారులు ప్రకటించడతమే తప్ప ఎక్కడా ఆచరించడంలేదు. ఇప్పటికైనా సివిల్ సప్లాయిస్ అధికారులు స్పందించి రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా చూడాలని, రేషన్ షాపులు, మిల్లుల్లో తనిఖీలు చేయాలని పలువురు కోరుతున్నారు.

అమ్మకాలు, కొనుగోలు చేస్తే చర్యలు



పేదల కోసం ప్రభుత్వం పీడీఎఫ్ బియ్యాన్ని రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేస్తోంది. బియ్యాన్ని మిల్లులకు తరలించి అక్రమాలకు పాల్పడితే డీలర్లపై, పాలిష్ చేసి అమ్మకాలు చేసే వారిపై చర్యలు తీసుకుంటాం. రేషన్ బియ్యాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలి.

– రుక్మిణి, జిల్లా సివిల్ సప్లయీస్ అధికారి

క్లుప్తంగా

అటవీ ప్రాంతంలో ఎఫ్‌డీఓ తనిఖీ

జూలూరుపాడు: మండలంలోని రాజారావుపేట అటవీ ప్రాంతాన్ని శుక్రవారం కొత్తగూడెం ఎఫ్‌డీఓ కోటేశ్వరరావు ఆకస్మికంగా సందర్శించారు. ఇటీవల రాజారావుపేట బీట్‌లో పాపకొల్లు గ్రామానికి చెందిన ప్రసాద్ తన పొలం పక్కన ఉన్న అడవిలోని చెట్లను కూలీలతో నరికించి అటవీ భూమిని ఆక్రమించుకునేందుకు యత్నించడంతో అటవీ అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని అడ్డుకున్నారు. ఆక్రమణకు పాల్పడిన వ్యక్తిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న ఎఫ్‌డీఓ కోటేశ్వరరావు రాజారావుపేట బీట్‌లో అడవిలో చెట్లను నరికిన ప్రాంతాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ క్రమంలో అటవీ సిబ్బంది ఎస్కే రహీం, కిషన్‌తో ప్రసాద్, అతని తల్లి వాగ్వాదానికి దిగి దాడి చేసేందుకు యత్నించారు. ఎఫ్‌డీఓ ఎదుటనే తోపులాట జరగడంతో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత వ్యక్తులపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని అటవీ సిబ్బందిని ఆదేశించారు. ఎఫ్ఆర్ఓ ప్రసాద్‌రావును వివరణ కోరగా అటవీ సిబ్బందిపై దాడికి యత్నించిన ప్రసాద్, అతని తల్లిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్నట్లు చెప్పారు.

ఇద్దరు మావోయిస్టుల లొంగుబాటు


లొంగిపోయిన మావోయిస్టులతో పోలీసు అధికారులు

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుక్మా జిల్లా టేకులగూడ సహా ఇతర ఘటనల్లో పాల్గొన్న ఇద్దరు మావోయిస్టులు శుక్రవారం లొంగిపోయారు. సుక్మా జిల్లా ఎస్పీ కమల్‌సింగ్, సీఆర్‌పీఎఫ్ సెకండ్ ఇన్ కమాండెంట్ పరమేశ్వర్ తిలక్ వర్మ ఎదుట వీరిద్దరు లొంగిపోయినట్లు తెలిపారు. పీఎల్‌జీఏ బెటాలియన్-1లో చురుకుగా వ్యవహరించే వీరు కొన్నేళ్లుగా మావోయిస్టుల కార్యాకలాపాల్లో చురుగ్గా పనిచేస్తున్నారు. సుక్మా జిల్లా టేకులగూడలో 22 మంది జవాన్లు మృతి చెందిన ఘటనలో పాల్గొన్న వీరిద్దరిపై ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం రూ.8 లక్షల చొప్పున రివార్డు ప్రకటించిందని అధికారులు తెలిపారు. ఈ మేరకు ఫొటోతో సహా ప్రకటన విడుదల చేసిన అధికారులు లొంగిపోయిన వారి పేర్లను మాత్రం ప్రకటించలేదు.

యువతి అదృశ్యంపై కేసు

అశ్వారావుపేటరూరల్: యువతి కనిపించకుండా పోయిన ఘటనపై శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ శివరామకృష్ణ కథనం ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఇరవై ఏళ్ల యువతి హైదరాబాద్‌లో డిగ్రీ చదువుతోంది. కాగా, గత నెల 26వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో తండ్రి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గోదావరి వంతెనపై లారీకి మంటలు



బూర్గంపాడు: మండల పరిధిలోని గోదావరి బ్రిడ్జిపై శుక్రవారం రాత్రి ఓ లారీ మంటలు అంటుకుని కొంతమేర దగ్ధమైంది. స్థానికుల కథనం ప్రకారం.. జగదల్‌పూర్ నుంచి ఏపీలోని విజయవాడకు ఇనుప సామగ్రి లోడ్‌తో లారీ వస్తోంది. వంతెనపైకి రాగానే టైరు పంక్చర్ కావడంతో రాపిడికి గురై మంటలు చెలరేగాయి. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. బూర్గంపాడు, భద్రాచలం పోలీసులు, అగ్నిమాపక శాఖ అధికారులు ఘటనా స్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు. దీంతో ప్రమాదం తప్పింది. కాగా పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

కొండచిలువ పట్టివేత


కొండచిలువను పట్టుకున్న స్థానికులు

సింగరేణి(కొత్తగూడెం): చుంచుపల్లి మండలంలోని రుద్రంపూర్ ఎస్బీఐ ఏటీఎం వద్ద శుక్రవారం రాత్రి కొండచిలువ కనిపించింది. దీంతో ఏటీఎంకు వచ్చిన వినియోగదారులు భయాందోళనకు గురయ్యారు. విషయం తెలిసిన మదర్ థెరిస్సా సేవా సంస్థ నిర్వాహకులు గూడెల్లి యాకయ్య మరికొందరి సాయంతో పామును పట్టుకొని 5 షాఫ్ట్ అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు. కోలాపురి ధర్మారావు పాల్గొన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,828


టేకులపల్లిలో ధ్వంసం చేయకముందు బెండకాయ తోట


ధ్వంసం చేశాక..

ధర లేదు.. గిట్టుబాటు కాదు


మూడ్ హుస్సేన్‌నాయక్

ఆశించిన మేర ధర రాకపోవడంతో ఆవేదన చెందిన ఓ రైతు కాపుకొచ్చిన బెండకాయ తోటను ట్రాక్టర్‌తో దున్ని ధ్వంసం చేశాడు. వివరాల్లోకి వెళ్తే.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం మూడ్ తండాకు చెందిన మూడ్ హుస్సేన్ నాయక్ మండల కేంద్రంలోని తన వ్యవసాయ భూమిలో అర ఎకరం మేర గత నెలలో బెండ పంట వేశాడు. విత్తనాలు నాటడం, ఎరువులు ఇతరత్రా కలిపి సుమారు రూ.30 వేల వరకు ఖర్చయింది. ఇంతలోనే కోతకు రావడంతో మార్కెట్‌కు తీసుకెళ్తే కేజీ రూ.5 నుంచి రూ.10 వరకే ఇస్తామని వ్యాపారులు చెబుతున్నారు. మార్కెట్‌లో మాత్రం కేజీ బెండకాయ రూ.20కు విక్రయిస్తున్నారు. కనీసం రూ.15 పలికినా ఊరటగా ఉంటుందని భావించి రెండు క్వింటాళ్ల బెండకాయలను ఇల్లెందుకు తీసుకెళ్తే 50 కేజీల బస్తాకు రూ.200 మాత్రమే ఇస్తామని చెప్పారు. దీంతో ఆ బెండకాయలను వాగులో పారబోసిన రైతు శుక్రవారం ట్రాక్టర్‌తో అర ఎకరం బెండ తోటను పూర్తిగా దున్నేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరుగాలం కష్టపడి బెండ సాగు చేస్తే రూ.30 వేలు ఖర్చు కాగా.. మార్కెట్‌లో వ్యాపారులు కేజీకి రూ.5 నుంచి రూ.10 లోపే అడుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. కనీసం పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేక పంటను ధ్వంసం చేశానని వాపోయాడు. – టేకులపల్లి

బెండ తోటను దున్నిన రైతు


పారబోసిన బెండకాయలు

యూరియా.. నయా దందా

- వ్యాపారి నుంచి సహకార సంఘానికి.. అటు నుంచి రైతుకు..
- అక్రమ మార్గంలో ప్రైవేట్ దుకాణాలకు తరలింపు
- విచారణలో వెలుగు చూస్తున్న వాస్తవాలు
- పీఏసీఎస్ అధికారి, డీసీసీబీ డైరెక్టర్‌పై కేసు నమోదు


పీఏసీఎస్ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

ఇల్లెందురూరల్: బహిరంగ మార్కెట్‌లో వ్యాపారులు అదను చూసి యూరియా బ్లాక్ చేసి అధిక ధరలకు విక్రయిస్తుండటంతో ఏటా రైతులు ఇబ్బంది పడేవారు. ఈ సమస్యను అధిగమించేందుకు ప్రభుత్వం యూరియా విక్రయాల బాధ్యతను 40 శాతం ప్రైవేట్ వ్యాపారులకు 60 శాతం పీఏసీఎస్‌లకు అప్పగించింది. కానీ, పీఏసీఎస్ అధికారులు సైతం యూరియాను రైతులకు నేరుగా విక్రయించకుండా వ్యాపారుల ద్వారా విక్రయిస్తున్నట్లు తాజాగా ఇల్లెందులో వెలుగు చూసిన అక్రమ తరలింపు ద్వారా వెలుగులోకి వచ్చింది. ఫలితంగా మద్దతు ధరకు యూరియాను రైతులకు అందించాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరకుండా పోతోంది. వివరాలిలా ఉన్నాయి.

యూరియా విక్రయాలపై విచారణ

ఇల్లెందు పీఏసీఎస్ ద్వారా యూరియా విక్రయాలలో అక్రమాలు చోటుచేసుకుంటున్నట్లు పోలీసులకు పట్టుబడిన 70 బస్తాల యూరియానే నిదర్శనం. ఈ ఘటనపై సహకార సంఘం ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. దీంతో ఇల్లెందు ఏడీఏ లాల్‌చంద్, సహకార శాఖ సీనియర్ ఇన్‌స్పెక్టర్లు కె.రమేశ్, మేకుమారి, కనకదుర్గ, ఏఓ టెక్నికల్ రామకృష్ణ, వ్యవసాయశాఖ ఏఈఓలు ప్రవీణ్ ప్రకాష్, వంశీనాయక్ శుక్రవారం పీఏసీఎస్ కార్యాలయంలో విచారణ ప్రారంభించారు. ప్రస్తుత సీజన్‌లో పీఏసీఎస్‌కు చేరిన యూరియా నిల్వలు, విక్రయాలకు సంబంధించిన రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించారు. రోజువారీగా నమోదు చేసిన స్టాక్, రోజువారీ విక్రయాలను సరిచూశారు.

నిల్వ వివరాల్లో తేడా

పీఏసీఎస్ ద్వారా యూరియా విక్రయాలు ఇల్లెందు వ్యవసాయ మార్కెట్‌లో కొనసాగుతున్నాయి. గురువారం రాత్రి వచ్చిన యూరియాలోడ్‌తో కలిపి గురువారం నాటికి స్టాక్ 538 బస్తాలుగా రిజిస్టర్‌లో నమోదై ఉంది. కానీ, మధ్యాహ్నం వ్యవసాయ మార్కెట్ యార్డుకు అధికారులు విచారణకు చేరుకున్న సమయానికి స్టాక్ పాయింట్‌లో 207 బస్తాలు మాత్రమే నిల్వ ఉన్నట్లు గుర్తించారు. అంటే అప్పటికే 231 బస్తాలు విక్రయించినట్లుగా అధికారులు నిర్ధారించి శుక్రవారం విక్రయాల రిజిస్టర్‌ను పరిశీలించారు. కానీ, అందులో కేవలం 58 బస్తాలు మాత్రమే విక్రయించినట్లుగా నమోదై ఉంది. ఇంతేకాకుండా అందుకు సరిపడా మాత్రమే డబ్బులు పీఏసీఎస్ సిబ్బంది వద్ద అధికారులు గుర్తించారు. కానీ, ఆ తరువాత వివరాలు వెల్లడించే సమయంలో కేవలం 46 బస్తాలు మాత్రమే తేడా ఉన్నట్లుగా ఏడీఏ లాల్‌చంద్ ప్రకటించారు. అంటే గురువారం రాత్రి 178 బస్తాల యూరియా అక్రమంగా వ్యాపారుల వద్దకు చేరుకున్నట్లు విచారణ తీరును పరిశీలిస్తే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పోలీసులకు ఫిర్యాదు

స్టాక్ పాయింట్‌లో కనిపించిన తేడా, పీఏసీఎస్ అధికారుల నుంచి స్పష్టమైన సమాధానాలు లేకపోవడంతో విచారణ అధికారులు ఉన్నతాధికారుల ఆదేశం మేరకు మాణిక్యారంలో గురువారం రాత్రి పట్టుబడిన 70 బస్తాలకు సంబంధించి కొమరారం పోలీస్ స్టేషన్‌లో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. యూరియా నిల్వలను గుర్తించిన గోదాము యజమాని డీసీసీబీ డైరెక్టర్ జనగాం కోటేశ్వరరావు, పీఏసీఎస్ సీఈఓ హరిప్రసాద్, యూరియాను తరలించిన వాహనం డ్రైవర్ ఉపేందర్‌పై కేసు నమోదు చేసినట్లు కొమరారం ఎస్‌ఐ సోమేశ్వర్ తెలిపారు. ఇదిలా ఉండగా మాణిక్యారంలో పట్టుబడిన 70 బస్తాలకు సంబంధించి రశీదుల్లో పేర్కొన్న రైతులను శనివారం విచారిస్తామని ఏడీఏ లాల్‌చంద్ తెలిపారు.

ప్రైవేట్ వ్యాపారుల్లో దడ

యూరియా విక్రయాలపై వ్యవసాయ, సహకార శాఖ అధికారుల విచారణలో ప్రైవేట్ వ్యాపారులపై ఆరోపణలు వెల్లువెత్తాయి. సీజన్ ప్రారంభంలో యూరియా నిల్వలు అన్ని ప్రైవేట్ దుకాణాలకు చేరుకోగా అనతికాలంలోనే కొన్ని దుకాణాల్లో స్టాక్ లేదని రైతులకు సమాధానం ఎదురైనట్లుగా ప్రచారం జరిగింది. ఇంతేకాకుండా యూరియా కేటాయింపు ఇల్లెందుకు పెంచాలని కోరుతూ ఫర్టిలైజర్స్ దుకాణాల యజమానుల సంఘం బాధ్యులు జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కానీ, ఆ సమయంలో అన్ని దుకాణాల్లో యూరియా నిల్వలు అవసరం మేరకు ఉన్నట్లు వ్యవసాయశాఖ ప్రకటించడం గమనార్హం. అయితే యూరియా విక్రయాలు, నిల్వలపై క్రమం తప్పకుండా తనిఖీలు చేస్తున్న వ్యవసాయశాఖ, విజిలెన్స్ అధికారులు లోపాలను గుర్తించి చర్యలకు ఉపక్రమించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఇదే విషయాన్ని పలు రాజకీయ పక్షాల నాయకులు, రైతులు విచారణకు హాజరైన అధికారులను ప్రశ్నించడంతో ప్రైవేట్ వ్యాపారుల్లోనూ అలజడి ప్రారంభమైనట్లు తెలుస్తోంది.

ఆర్‌ఎంపీలు అర్హతకు మించి వైద్యం చేయొద్దు


క్లినిక్‌ను సీజ్ చేస్తున్న వైద్యశాఖ అధికారులు

చుంచుపల్లి: ఆర్‌ఎంపీలు అర్హతకు మించి వైద్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని వైద్యశాఖ అధికారులు హెచ్చరించారు. శుక్రవారం పెనగడప ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి డాక్టర్ నేహా అంబ్రిన్, డిప్యూటీ డెమో ఎండీ.ఫైజ్ మోహియుద్దీన్ క్లినిక్‌లలో దాడులు నిర్వహించారు. పెనగడపలోని కట్ల వీరభద్ర అనే వ్యక్తి ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌లో చికిత్స పొంది తీవ్ర అస్వస్థతకు గురికాగా, విచారించి ఆ క్లినిక్‌ను సీజ్ చేశారు. 4 ఇంక్లైన్ గ్రామంలో ఆర్‌ఎంపీని అర్హతకు మించి వైద్య చేస్తున్నట్లు గుర్తించి క్లినిక్‌ను సీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెనగడప పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్, ఏఎస్‌ఎం, ఆశలు పాల్గొన్నారు.

25న సీనియర్ జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక

భద్రాచలంటౌన్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఈ నెల 25న జిల్లా సీనియర్ క్రికెట్ జట్టు ఎంపిక జరగనున్నట్లు తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ బాధ్యులు శరాన్ తేజ, ఆనంద్ పాల్ (బుజ్జి) శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాల్గొనాలనుకునే క్రీడాకారులు తమ వెంట జనన ధ్రువీకరణ పత్రంతో పాటు ఆధార్ కార్డ్ తీసుకురావాలని తెలిపారు. ఎంపికలో ప్రతిభ చూపిన క్రీడాకారులను ఈ నెల 27 నుంచి వరంగల్‌లో జరిగే ఈస్ట్ జోనల్ టోర్నీకి ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఈ మ్యాచ్‌లు లీగ్ పద్ధతిలో జరుగుతాయని, క్రీడాకారులు ఉదయం 9 గంటలకు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చేరుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 96526 27452, 98664 51123 నంబర్లలో సంప్రదించాలని వివరించారు.

నేడు క్రీడా పోటీలు

కొత్తగూడెంటౌన్: ఈ నెల 25న యువ క్రీడాకారుల కోసం క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు శుక్రవారం జిల్లా యువజన క్రీడలశాఖ అధికారి పి.పరంధామరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. జాతీయ క్రీడా దినోత్సవం (హాకీ లెజెండ్ మేజర్ ధ్యాన్‌చంద్ పుట్టినరోజు పురస్కరించుకుని) ఈ పోటీలను నిర్వహిస్తున్నామని, ఆర్చరీ విభాగంలో పాల్వంచ మినీ స్టేడియంలో అండర్ - 14, 17, 19 వాళ్లకు పోటీలు ఉంటాయని, వివరాలకు టి.కళ్యాణ్ 95157 23780 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. అదే మినీ స్టేడియంలో అథ్లెటిక్స్‌లో ఓపెన్ కేటగిరి 100 మీటర్ల షాట్‌పుట్, లాంగ్ జంప్ పోటీల వివరాలకు కె.మహీధర్ 94401 16105, లక్ష్మీదేవిపల్లి రామచంద్ర డిగ్రీ కాలేజీలో హాకీ ఓపెన్ కేటగిరి విభాగంలో పాల్గొనే వారు బీఎస్ ప్రేమ్ 99494 46551 నంబర్‌లో సంప్రదించాలని ఆయన వివరించారు.

గీత కార్మికులకు రక్షణ కిట్లు ఇస్తాం

అశ్వారావుపేటరూరల్: గీత కార్మికులకు రక్షణ కిట్లు అందజేస్తామని బీసీ సంక్షేమ శాఖ అధికారిణి ఇందిర తెలిపారు. కాటమయ్య రక్షా కవచ్ కార్యక్రమంలో భాగంగా తాటి చెట్లు ఎక్కడంపై శుక్రవారం ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. అశ్వారావుపేటలో బీసీ సంక్షేమ శాఖ, ఎక్సైజ్ శాఖ సంయుక్తంగా నిర్వహించగా, ఇందిర మాట్లాడుతూ గీత కార్మికులు ప్రమాదాల బారిన పడకుండా ఉండేందుకు కిట్లు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై రాజేశ్వరరావు, గీత కార్మిక సంఘం బాధ్యులు ఆరేపల్లి బాబురావు, గీత కార్మికులు పాల్గొన్నారు.


కార్మికుడికి చెట్టు ఎక్కడంపై శిక్షణ ఇస్తున్న సిబ్బంది

విద్యార్థినులతో అసభ్య ప్రవర్తన, ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు

కొత్తగూడెం సింగరేణి పాఠశాలలో ఘటన


సింగరేణి పాఠశాల వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

సింగరేణి(కొత్తగూడెం): విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయుడే వికృతంగా ప్రవర్తించాడు. ఈ ఘటన కొత్తగూడెంలోని సింగరేణి పాఠశాలలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. కొత్తగూడెంలోని సింగరేణి పాఠశాలలో ఓ ఉపాధ్యాయుడు విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని శుక్రవారం తల్లిదండ్రులు ఆందోళన చేశారు. మణుగూరు పాఠశాల నుంచి ఇటీవల బదిలీపై వచ్చిన తెలుగు ఉపాధ్యాయుడు వేణు తీరుతో విసిగిపోయిన విద్యార్థినులు తాము పాఠశాలకు వెళ్లబోమని చెప్పారు. దీంతో తల్లిదండ్రులు ఆందోళనకు దిగగా కొత్తగూడెం వన్‌టౌన్ సీఐ కరుణాకర్ చేరుకుని ఆయనను అదుపులోకి తీసుకున్నారు. తల్లిదండ్రుల ఫిర్యాదుతో పోక్సో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ విషయమై సింగరేణి విద్యావిభాగం జీఎం నికోలస్ స్పందిస్తూ తెలుగు ఉపాధ్యాయుడు వేణును సస్పెండ్ చేశామని, ఆయనపై ఆరోపణలు రుజువైతే కఠిన చర్యలు తీసుకుంటామని ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఉపాధ్యాయుడు పోలీసుల అదుపులో ఉన్నందున పూర్తిస్థాయి విచారణకు ఆదేశించామని పేర్కొన్నారు.

బీజేపీ సభ్యత్వ కమిటీ నియామకం

చుంచుపల్లి: బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి జిల్లా కమిటీని నియమించారు. సభ్యత్వ నమోదు కమిటీలో జిల్లా కన్వీనర్‌గా పానిశెట్టి వెంకటేశ్వర్లు, జాయింట్ కన్వీనర్లుగా కొలికపోగు మునలయ్య, తాటిపాముల ఐలయ్య, భైరి నిర్మలదేవిని నియమించారు. బీజేపీ సంస్థాగత నిర్మాణం కోసం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం సెప్టెంబర్ 1 నుంచి 25 వరకు మొదటి విడత సభ్యత్వ నమోదు కార్యక్రమం అక్టోబర్ 1 నుంచి 15 వరకు రెండో విడత సభ్యత్వ నమోదు నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షులు కేవీ రంగాకిరణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

దాడి చేసినవారిపై కేసు

బూర్గంపాడు: గోవుల అక్రమ రవాణా చేస్తున్నారనే సమాచారంతో జింకలగూడెం గ్రామం వద్దకు కవరేజీకి వెళ్లిన మోరంపల్లిబంజర గ్రామానికి చెందిన విలేకరి ఆవుల మహేశ్‌రెడ్డి, ఆయన స్నేహితుడిపై కొందరు వ్యక్తులు దాడికి పాల్పడిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. జింకలగూడెం గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు గోవులను అక్రమంగా తరలిస్తుండగా కవరేజీ కోసం అక్కడకు వెళ్లిన మహేశ్‌రెడ్డి, ఆయన స్నేహితుడిపై కొందరు కత్తితో దాడికి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు


గుప్త నిధుల కోసం తవ్విన గుంత

చండ్రుగొండ: మండల కేంద్రం శివారు ఇమ్మడి రామయ్యబంజర గ్రామ సమీపంలో గురువారం అర్ధరాత్రి గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. ఇమ్మడి రామయ్యబంజర శివారులో ఉన్న 133/32 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పక్కన ఉన్న జామాయిల్ తోటలో శుక్రవారం తెల్లవారుజామున తొమ్మిదిమంది యువకులు గుప్త నిధుల కోసం మంత్రగాళ్ల సాయంతో పూజలు చేసి తవ్వకాలు జరిపారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ గంజి స్వప్న సిబ్బందితో కలిసి దాడి చేసి తొమ్మిది మంది యువకులను అదుపులోకి తీసుకున్నారు. వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టారు. ఆ ప్రాంతంలో క్షుద్రపూజలు జరిపినట్లు ఆధారాలు ఉండటంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. సుమారు 10 అడుగుల లోతులో తవ్వకాలు చేశారు. దీంతో పథకం ప్రకారమే గుప్త నిధుల కోసం అన్వేషించినట్లు తెలిసింది.

గుట్కా ప్యాకెట్లు స్వాధీనం

ములకలపల్లి: నిషేధిత గుట్కా ప్యాకెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్న ఘటన శుక్రవారం మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌హెచ్‌ఓ పుల్లారావు కథనం మేరకు.. మండలంలోని జగన్నాథపురం గ్రామంలో గుట్కా విక్రయిస్తున్నట్లు సమాచారం అందటంతో దాడులు చేసి ఓ వ్యక్తి వద్ద నుంచి గుట్కాప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ తెలిపారు.

చెరువులో పడి మతిస్థిమితం లేని వ్యక్తి మృతి

చర్ల: మండలంలోని దానవాయిపేటకు చెందిన మతిస్థిమితం లేని వ్యక్తి నాలుగు రోజుల కిందట అదృశ్యం కాగా శుక్రవారం సాయంత్రం ఆర్.కొత్తగూడెంలోని చెరువులో విగతజీవిగా కనిపించాడు. వివరాలిలా ఉన్నాయి. దానవాయిపేటకు చెందిన కణితి సీతారాములుకు కొంతకాలంగా మతిస్థిమితం సరిగ్గాలేదు. సోమవారం ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. భార్య, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఎంత వెతికినా ఆచూకీ దొరకలేదు. శుక్రవారం సాయంత్రం ఆర్.కొత్తగూడెంలోని చెరువు ప్రాంతంలో పశువులు మేపుతున్న కొందరు వ్యక్తులు చెరువులో మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించి, మృతదేహాన్ని బయటకు తీసి కణితి సీతారాములుగా గుర్తించారు. మృతుడికి భార్య సావిత్రి, ఇద్దరు పిల్లలున్నారు.

చికిత్స పొందుతున్న యువకుడు..

బూర్గంపాడు: లక్ష్మీపురం గ్రామ పంచాయతీలోని ఉడ్‌యార్డుకు చెందిన ఎల్లబోయిన నాగేంద్రబాబు (19) కడుపునొప్పి తాళలేక పదిరోజుల కిందట పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు భద్రాచలం ఏరియాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న యవకుడు పరిస్థితి విషమించి శుక్రవారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రాజేశ్ తెలిపారు.

నాటుసారా స్థావరాలపై దాడి


బెల్లం పానకాన్ని చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

దుమ్ముగూడెం: మండలంలోని సుజ్ఞానపురం గ్రామంలో ఎక్సైజ్, పోలీస్ అధికారులు శుక్రవారం సంయుక్తంగా దాడులు చేపట్టారు. 300 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేయగా 5 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. దాడుల్లో ఏఈఎస్ కరమ్‌చంద్, సీఐ రహీమున్నీసాబేగం, ఎస్‌ఐలు అల్లూరి సీతారామరాజు, గౌతమ్, కిశోర్‌బాబు, ఎక్సైజ్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రెండు ఇసుక లారీలు పట్టివేత

పాల్వంచరూరల్: మొర్రేడు వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు లారీలను పోలీసులు పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. శ్రీనివాసకాలనీ వద్ద గల మొర్రేడు వాగు నుంచి ఇసుకను అక్రమంగా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న రెండు లారీలను శుక్రవారం పట్టణ ఎస్‌ఐ సుమన్ పట్టుకున్నారు. లారీడ్రైవర్లు మధు, వంశీతోపాటు ఓనర్లపై కూడా కేసు నమోదు చేశామని ఎస్‌ఐ వెల్లడించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Services

FINANCE SERVICE

■ గవర్నమెంట్ లేదా ప్రయివేట్ ఉద్యోగులకు, వ్యాపారస్తులకు 24 గం॥లలో ఫైనాన్స్ చేయబడును. అన్ని బ్యాంకుల జీరో బ్యాలన్స్ A/c.లు కూడా తెరువబడును. నో ఫీజు. సం॥ 93819 63269. [M-1185283]

BUSINESS OFFER

■ Rainbow Happy Life ప్రొడక్ట్‌ను కొనుగోలు చేసి (2)ని రిఫర్ చేయండి ప్రతి రోజు ఆదాయం, ప్రతినెల కొనుగోలు ద్వారా ప్రతినెల క్యాష్ బ్యాక్ 9700937979 [H-783055]

Wanted

■ ఖమ్మం జిల్లాలో మా సర్వీస్ నందు పని చేయుటకు ఎలక్ట్రీషన్, ప్లంబర్ అండ్ శానిటరీ, A/C టెక్నీషియన్లు, గీజర్, వాషింగ్ మిషన్ రిపేర్ టెక్నీషియన్స్ కావలెను. సంప్ర. 80744 89455. [M-1185389]

■ సత్తుపల్లిలో నూతనంగా ప్రారంభిస్తున్న హీరో షోరూం మరియు వర్క్ షాపు నందు పని చేయుటకు క్రింద అభ్యర్థులు కావలెను. (1) వర్క్ షాపు సూపర్‌వైజర్స్-2, (2) కంప్యూటర్ ఆపరేటర్స్-1, (3) మెకానిక్స్-3, (4) వాటర్ వాష్ బాయ్స్-2. ఆకర్షణీయమైన జీతం మరియు ప్రోత్సాహకాలు ఇవ్వబడును. ఇంటర్వ్యూ తేది : 26-8-2024 ఉదయం 10 గం॥ల నుండి 2 గం॥ల వరకు, స్థలం : హీరో షో రూం, JVR పార్క్ దగ్గర, వసంత్‌నగర్, సత్తుపల్లి. వివరాలకు సంప్ర. 96037 94663. [M-1185386]

■ శివకార్తికేయ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను,పేషెంట్స్, పిల్లలను చూసుకొనుటకు, ఇంటి / వంట పనికి వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి +భోజనం,జీ:18K. 9912011499, 9912011899 [H-796270]

సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి

వివరాలకు :

ఖమ్మం	9705444182, 9010299957
కొత్తగూడెం	9010223783
పాల్వంచ	9705444183
భద్రాచలం	9951602914
మణుగూరు	9705944416
సత్తుపల్లి	9652868642
మధిర	9949927792

సాక్షి ద్వారా మీ చిన్నారి పుట్టిన రోజు శుభాకాంక్షలను తెలియజేయండి
కేవలం రూ. 500/- మాత్రమే
(GST 5% అదనం)

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.